# శిలాకృతులకు సమాధి

- అభివృద్ధి పనుల్లో అధికారుల పర్యవేక్షణ కరువు
- పట్టించుకోని కేంద్ర పురావస్తు శాఖ

ఖిలావరంగల్, డిసెంబర్ 7: చారిత్రక నేపథ్యం కలిగిన ఓరుగల్లు కోటలో శిల్ప సంపదకు భద్రత కరువైంది. ఇప్పటికే కోట పరిసర ప్రాంతాల్లో విసిరివేయబడినట్లు పడి ఉన్న శిల్పాలను ఒక్కచోట పేర్వకపోవడం వల్ల ఎండకు ఎండి, వానకు తడుతస్తున్నాయి. అలాగే, గతంలో పలు ప్రాంతాల్లో ఎట్టికిపడి ఉన్న శివలింగాలు, నందీశ్వర విగ్రహాలను దొంగలు అపహరించుకుపోయిన ఘటనలూ ఉన్నాయి. అయినా కేంద్ర పురావస్తు శాఖ పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉంటే.. చారిత్రక కట్టడాలను పరిరక్షించే పనుల్లో ఉన్నతాధికారులు కచ్చితంగా పర్యవేక్షించాల్సి ఉంది. కానీ, కోటలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గాలికొదిలేశారు. దీంతో కూలీలు ఇష్టారాజ్యంగా కోటరాళ్లను తవ్వుతూ పనులు చేపడుతున్నారు.



రాతికోట ఉత్తర ద్వారం వద్ద చేపట్టిన పనుల్లో బయట పడిన శిలాకృతులు, తవ్వకాల్లో బయట పడిన శిలాకృతులను పునాది రాళ్లుగా మార్చిన కూలీలు (ఇన్‌సెట్‌లో)

### శిలాకృతులకు సమాధి

తవ్వకాల్లో గాని, మరే ఇతర ప్రాంతాల్లో లభించిన శిలాకృతులను ఒక్కచోట చేర్చేందుకు డాక్యుమెంటేషన్ ద్వారా తరలిస్తారు. అయితే, రాతికోట ఉత్తర ద్వారం వద్ద కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కూలిపోయిన కోటకు మరమ్మతులు చేపడుతున్నారు. అయితే, కూలీలు చేపట్టిన తవ్వకాల్లో శిలలకు సంబంధించిన ఆనవాళ్లు బయట పడుతున్నాయి. చారిత్రక ప్రాంతాల్లో దొరికే ఒక్కో శిల్పం లేదా ఆనవాళ్లు ఎంతో జాగ్రత్తగా భద్రపరుస్తారు. వీటి ఆధారంగా పరిశోధనలు చేపటడ్డం ఆనవాయితీ. కానీ, కోటలో అధికారుల పర్యవేక్షణ లేకుండా విచ్చలవిడిగా తవ్వకాలు చేపడుతున్నారు. ఈ తవ్వకాల్లో బయట పడిన శిల్పాలను కూడా పునాధి రాళ్లుగా ఉపయోగించడంతో కేంద్ర పురావస్తు శాఖ అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోటను సుందరీకరించే పనులు జరుగుతుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అయితే, పనులు జరుగుతున్న తీరు నిబంధనలకు విరుద్ధంగా ఉందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. కేంద్రపురావస్తు శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పనులు జరగాలని, అదేవిధంగా తవ్వకాల్లో బయపడిన శిలాకృతులను ఒక్కచోటకు చేర్చాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.



రాతికోట వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు



రైతులకు లేగదూడలను అందజేస్తున్న మహేశ్ అగర్వాల్

## గోసంరక్షణతోనే వ్యవసాయానికి మనుగడ

**గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మహేశ్ అగర్వాల్**

వర్ధన్నపేట, డిసెంబర్ 7 : రైతులు గోవులను సంరక్షించుకోవడంతోనే భవిష్యత్‌లో వ్యవసాయానికి మనుగడ ఉంటుందని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మహేశ్‌అగర్వాల్ సూచించారు. వర్ధన్నపేట పట్టణ శివారులోని జగ్గిపేటలో భారత్ గోశాల ఆధ్వర్యంలో 20 మంది రైతులకు 40 లేగదూడలను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మహేశ్ అగర్వాల్ హాజరై లేగదూడలు పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు కేవలం రసాయనిక ఎరువులపై ఆధారపడి ఏటా పంటలను సాగు చేస్తున్నారన్నారు. దీంతో పంటలు విషతుల్యంగా మారి ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తున్నాయన్నారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సంప్రదాయ పద్ధతిలో గోవులను సంరక్షించుకొని గోవుల పేడ, మూత్రంతో సేంద్రియ ఎరువులను వాడి పంటలను పండిస్తే రైతులకు ఖర్చులు తగ్గడంతోపాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్, సూపరింటెండెంట్ దుర్గం రోజా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాకూబ్‌నాయక్ పాల్గొన్నారు.

## వైభవంగా శివలింగ ప్రతిష్ఠాపన

దామెర, డిసెంబర్ 7: వెంకటాపురంలో వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య గురువారం శివపంచాయతన ఆలయంలో శివలింగ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారి గర్భగుడిలో ప్రతిష్ఠించే శివలింగం, ధ్వజస్తంభం, నవగ్రహాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అశేష భక్తజనం మధ్య శివోహం నామస్మరణతో యంత్ర ప్రతిష్ఠాపన జరిపారు. తర్వాత శివలింగ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాస దేవుడైన శివుడికి విశేష అభిషేకాలు చేసి, భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నేరేడుపల్లి విద్యార్థుల ఎంపిక



షేక్ మున్నాఫ్, షేక్ సైదా

శాయంపేట, డిసెంబర్ 7: నేరేడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ జట్టి రాజేశ్వర్ గురువారం తెలిపారు. హనుమకొండలోని జేఎన్ఎస్‌లో 67వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14 ఏళ్లలోపు బాలబాలికలకు జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. 8వ తరగతి చదువుతున్న షేక్ మున్నాఫ్, 7వ తరగతి చదువుతున్న షేక్ సైదా ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మంచిర్యాలలో ఈ నెల 10 వరకు జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులు, పీఈటీ రాజేశ్వర్‌ను హెచ్ఎం పటేరు కరుణాకర్, ఉపాధ్యాయులు రామకృష్ణ, సుచరిత, చిన్నేశ్వర్‌రావు, సుధాకర్, సునీత, రవికాంత్ అభినందించారు.

## కలెక్టర్‌ను అభినందించిన టీఎన్జీవోస్

ఖిలావరంగల్, డిసెంబర్ 7: అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించినందుకు వరంగల్ టీఎన్జీవోస్ కార్యవర్గం గురువారం కలెక్టర్ పీ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, ప్రధాన కార్యదర్శి గాజె వేణుగోపాల్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాంకిషన్

# కాంగ్రెస్ నాయకుల సంబురాలు

- ఎమ్మెల్యే కొండా సురేఖకు మంత్రివర్గంలో చోటుపై హర్షం
- పటాకులు కాల్చి, స్వీట్ల పంపిణీ

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 7: ఎమ్మెల్యే కొండా సురేఖకు మంత్రివర్గంలో చోటు కల్పించడంతో తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం సంబురాలు నిర్వహించారు. వరంగల్ వెంకటరమణ జంక్షన్‌లో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఇద్దరు మహిళా శాసన సభ్యులకు మంత్రివర్గంలో చోటు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు సందెల లాజర్, కూచన రవీందర్, జంగం ప్రభాకర్, గుల్లపల్లి రామకృష్ణ, జస్ప్రీత్ సింగ్, బోలుగొడ్డు శ్రీనివాస్, కొండమీది సదానందం, రాజేందర్, మహిళా నేతలు గూడ శారద, నహీమా, జహీరా, దేవసాని కీర్తి, యూత్ నాయకులు పాల్గొన్నారు.

### స్వీట్లు పంచిన కాంగ్రెస్ నేతలు

శాయంపేట/సంగెం/కరీమాబాద్: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడం, కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో శాయంపేటలో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. బస్టాండ్ సెంటర్ వద్ద పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు పత్తి శ్రీనివాస్, రాజు, రఫి, సత్యం, కృష్ణమూర్తి, సుదర్శన్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా సంగెం మండలంలోని చింతలపల్లిలో కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బండి రాధిక, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాస్, నాయకులు డి.వెంకటేశ్వర్లు, కుందారపు శ్రీను, రవీందర్, రబ్బాని, యుగేంధర్, రవి, బబ్లూ, సాయి, నవీన్, అభిలాష్, విక్రమ్, ప్రవీణ్, నితిన్, కొమురమల్లు, సమ్మయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి సురేఖను కలిసిన నాయకులు

కరీమాబాద్/ఖిలావరంగల్: తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖను నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆమెను మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణుగోపాల్, మున్నూరుకాపు జిల్లా నాయకుడు బండి కుమారస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనాయత్ అక్తర్, దయ్యాల వీరేశం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కొండా సురేఖను వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఖిలావరంగల్ సొసైటీ చైర్మన్ సంగరబోయిన చందర్, మెగా ఫ్యామిలీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరాటే ప్రభాకర్, శ్రీరాం రాజేశ్, చిట్టిమల్ల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండా సురేఖకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

### సీఎం ప్రమాణస్వీకారానికి తరలిన నాయకులు

ఆత్మకూరు/దామెర: ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో చేసిన ప్రమాణస్వీకారానికి మండలంలోని ఆత్మకూరు, నీరుకుళ్ల, అక్కంపేట, పెద్దాపురం, చౌళ్లపల్లి, గూడెప్పాడ్, హౌసుబుజుర్గు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, సర్పంచ్ పర్వతగిరి రాజు, పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బయ్య తిరుపతి, కాంగ్రెస్ నాయకులు బయ్య కుమారస్వామి, దుగ్యాల శ్రీను, బరుపట్ల కిరిటి, బరుపట్ల అయోధ్య, గుండెబోయిన శ్యామ్, మానగాని తిరుపతి, బయ్య నరేశ్, తన్గుల రామనుజన్, రమేశ్, ఉడుత రాజేందర్ పాల్గొన్నారు. దామెర మండలంలోని కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారోత్సవానికి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. దామెర, ఊరుగొండ, పులుకుర్తి, ల్యాదెల్ల, కోగిల్వాయి నుంచి వాహనాల్లో వెళ్లారు. తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, పోలెపాక శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పోశాలు, హింగె నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

## నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

వరంగల్, డిసెంబర్ 7 (నమస్తేతెలంగాణ): వరంగల్ జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాంరెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ప్రారంభం కానుందన్నారు. గత సర్వసభ్య సమావేశంలో జరిగిన తీర్మానాలపై సమీక్ష, అనంతరం వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, పశు సంవర్ధక, మత్స్య, సహకార, మార్కెటింగ్ శాఖల ప్రగతి, ప్రజా పంపిణీ వ్యవస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఇందిరా క్రాంతి పథం, ఉపాధి హామీ పథకం, గృహనిర్మాణ సంస్థ, ఆరోగ్యం, పారిశుధ్యం, దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కుటుంబ సంక్షేమ పథకాల ద్వారా చేపట్టిన పనుల ప్రగతి, ప్రాథమిక విద్య, ఉన్నత విద్య, రాజీవ్ విద్యామిషన్, గ్రామ పంచాయతీల పన్నుల వసూళ్ల ప్రగతి, హరితహారం, సామాజిక అడవుల అభివృద్ధి, జీవ వైవిధ్యం, తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన పనుల ప్రగతిపై సమీక్ష ఉంటుందని జెడ్పీ సీఈవో వెల్లడించారు. విద్యుత్, రహదారులు, భవనాలు, విద్య, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సహకార సంస్థ కార్యక్రమాల ప్రగతి, గనుల శాఖ, జిల్లా పరిశ్రమల, చేనేత, ఖాదీ, యువజన సర్వీసులు, ఉపాధి కల్పన, ఎక్సైజ్ శాఖ, రోడ్డు రవాణా సంస్థ ప్రగతిపై సమీక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖానాపురం, డిసెంబర్ 7 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన మండలకేంద్రం శివారు పెట్రోల్ బంకు సమీపంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన సాయితేజ, స్టెల్లా వ్యక్తిగత పనిపై కారులో వరంగల్‌కు వెళ్తున్నారు. ఖానాపురం శివారు పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే రెడ్డి రంగారెడ్డి గార్డెన్స్ నుంచి ఖానాపురానికి చెందిన వీరస్వామి మోపైడ్‌పై మండలకేంద్రం వస్తుండగా, కారు అతివేగంగా వచ్చి మోపైడ్‌ను, సమీపంలోని చెట్టును ఢీకొని పొలంలో బోల్తాపడింది. మోపైడ్‌పై వస్తున్న వీరస్వామి కాలు విరిగింది.

అదృష్టవశాత్తు కారులో బెలూన్లు తెరుచుకోవడంతో సాయితేజ, స్టెల్లా స్వల్ప గాయాలతో బయటపడినారు. వీరస్వామిని ఆటోలో నర్సంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.